క్లుప్తంగా

మహిళా రక్షణ చట్టాలతో ప్రయోజనం



విద్యార్థినులతో డీఎస్పీ జ్యోతి రాణి

ఒంగోలు: నూతన క్రిమినల్ లా చట్టాలు–మహిళల హక్కులు, రక్షణ అనే అంశంపై స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ జ్యోతిరాణి విచ్చేసి నూతనంగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాలు మహిళల హక్కుల రక్షణకు, మహిళల హక్కులకు ఎలా అండగా నిలిచేది వివరించారు. లింగ సమానత్వం, సమాన వాటా, గౌరవంగా.. మర్యాదగా జీవించే హక్కు, పని ప్రదేశాల్లో వేధింపుల నుంచి రక్షణ మొదలైన హక్కులు నూతన చట్టాలు ఉన్నాయని తద్వారా ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అందువల్ల చట్టాలను గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఉన్నత లక్ష్యాల సాధనను అందుకోవాలని వివరించారు. కాలేజీ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ నిరసన ర్యాలీ

ఒంగోలు మెట్రో: తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. వివిధ క్షేత్రాల ఆధ్యాత్మిక సంఘాలచే స్థానిక కేశవ స్వామి పేట ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద నుంచి కలెక్టరేట్ ప్రకాశం భవనం వరకు నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం సమర్పించారు. పలు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఎంతో ప్రశస్తమైన తిరుమల లడ్డూ మహా ప్రసాదం కల్తీ చేయడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణలో ఉన్న అన్ని హిందూ దేవాలయాలను తక్షణమే పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేసి ధార్మిక సంస్థలకు, స్వామీజీలకు, భక్తులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ సోమ సుబ్బారావు జిల్లా కార్యదర్శి ఇనమన మెళ్లూరి సీతారామయ్య, ఈమని బలరాం, సుంకు బలరాం, గద్దం శ్రీనివాసులు, దేసు వెంకయ్య, శివాజీ, నేరెళ్ల శ్రీనివాసరావు, సాధు శ్రీనివాసగుప్తా, పసుమర్తి వేంకటేశ్వర్లు, మద్దు అరవింద లక్ష్మి, ఎన్. దేవకుమారి, యోగయ్య యాదవ్, గుర్రం సత్యనారాయణ, పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ సార్.. ఉద్యోగులకు న్యాయం చేయండి

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేస్తామని చెప్పిన మంత్రి లోకేష్ నేటికి వంద రోజులు గడుస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని సమగ్ర శిక్ష రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమగ్ర శిక్ష యూనియన్ నాయకులు అనేక సార్లు మంత్రి లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నామని తెలిపారు. కొంచెం సమయమివ్వండి అని చెప్పిన ఆయన రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకున్నట్టు లేదని వాపోయారు. వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ పోషణ భారమై అప్పులు చేస్తున్నారని తెలిపారు. రెండు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సమ్మె కాలపు హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తాగునీరు అందించాలి

చీమకుర్తి: కేవీ పాలెం గ్రామానికి రామతీర్థం రిజర్వాయర్ ద్వారా సాగర్ నీటిని తాగునీటి అవసరాల నిమిత్తం అందించాలని సీపీఎం ఎంపీటీసీ సభ్యురాలు వేమా అశ్విని ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. గురువారం ఎంపీడీఓను కలిసి గ్రామంలోని పాఠశాల మరమ్మతులు, శ్మశాన అభివృద్ధి, చేతి పంపుల మరమ్మతులు, సైడు డ్రైన్ల నిర్మాణానికి నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

9 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

చీమకుర్తి: జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 9 నుంచి 12 వరకు స్థానిక ప్రభుత్వ హైస్కూలు క్రీడాప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వాహకులు రామిరెడ్డి, రాఘవరెడ్డి గురువారం తెలిపారు. 8790586898 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాల వద్ద 80 సంవత్సరాల కేఎంఎస్ఎస్ మహాసభలు, 20వ విద్యా వైజ్ఞానిక మహాసభలు వాల్ పోస్టర్‌ను ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఐఫియా కౌన్సిలర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం పోరాడతామన్నారు. ఎ.అమ్మయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, పి.ప్రభాకరరావు, కె.పెద్దన్న, యం.సురేష్‌బాబు, టి.వెంకట్ పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి దర్శనం



గంటాపాలెం పార్వతీదేవి ఆలయం వద్ద విద్యుత్ దీప సెట్టింగ్



ఆదిలక్ష్మిదేవి అలంకరణలో రాజ్యలక్ష్మిదేవి



బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో లాయరుపేట సాయిబాబా ఆలయం లోని రాజరాజేశ్వరీదేవి



దర్శనం కోసం ఉన్న భక్తులు

ఒంగోలు మెట్రో: దేవి శరన్నవరాత్రులు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్కు శ్రీ సూక్తంతో పంచామృతాల అభిషేకం, శ్రీ చక్రానికి దేవి ఖడ్గమాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారు, మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రీ అమ్మవారు, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి, దేవస్థానంలో రాజలక్ష్మి అమ్మవారికి, కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న నాగలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అలాగే నగరంలో ఉన్న ఆలయాల్లో విశేష అలంకారాల్లో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

ఒంగోలు టౌన్: గుడ్లూరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన యం. నారాయణ రావు కుమారుడు అనిల్ కుమార్‌కు కారుణ్య నియామక పత్రాన్ని ఎస్పీ ఏఆర్ దామోదర్ అందజేశారు. పోలీసు ట్రైనింగ్ కళాశాలలో టైపిస్ట్‌గా ఉద్యోగం కల్పించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ నారాయణరావు అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరించాలని, అంకితభావంతో మెలగాలని సూచించారు. వృత్తి నైపుణ్యం పెంచుకోవడం ద్వారా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. నారాయణ రావు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సులోచన, డీపీఓ ఏ. సూపరింటెండెంట్ డి. శైలజ పాల్గొన్నారు.



నియామకపత్రం అందిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

మారిన చట్టాల గురించి తెలుసుకోండి



మాట్లాడుతున్న పీటీసీ సీఐ కరిముల్లా

ఒంగోలు: మారిన చట్టాల గురించి విద్యార్థులకు పూర్తి అవగాహన అవసరమని ఒంగోలు పోలీసు ట్రెనింగ్ కాలేజీ సీఐ కరిముల్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళల చట్టాలు, మహిళా సంరక్షణ విషయంలో చోటు చేసుకున్న చట్ట సవరణల గురించి తప్పకుండా తెలుసుకోవాలన్నారు. మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాలికలు సమాజంలో జరుగుతున్న విషయాలను గమనిస్తూ ఉంటూనే, వ్యక్తిగత రక్షణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వారిని మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజం పట్ల అవగాహన కల్పించ వచ్చునని అన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ స్టూడెంట్ అఫైర్స్ విభాగం డీన్ డాక్టర్ అంచుల భారతీ దేవి, సబ్ ఇన్స్పెక్టర్లు డి.రాజారావు, వీసీహెచ్ రామా నాయుడు, విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ పి.దేవదానం తోబాటు యూనివర్శిటీ కళాశాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో లక్షకు టోపీ

ఒంగోలు టౌన్: నగరానికి చెందిన ఒక మహిళకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ లక్ష రూపాయలు వసూలు చేసిన ఒక చిరుద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ.. బాధిత మహిళపై దాడికి దిగిన ఘటన వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. భాగ్యనగర్ 4వ లైనుకు చెందిన చిడితోటి లక్ష్మి ప్రియకు గద్దల గుంట అజయ్‌తో వివాహమైంది. భార్య భర్తల మధ్య విబేధాలు రావడంతో భాగ్యనగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ విషయాన్ని టంగుటూరు ఎమ్మార్వో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే గద్దల గుంటకు చెందిన కసుకుర్తి సందీప్ పసిగట్లాడు. ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఆమెను నమ్మబలికాడు. ఆమె దగ్గర నుంచి లక్ష రూపాయలు తీసుకున్నాడు. ఒకవేళ ఉద్యోగం రాకపోతే అందుకు బదులుగా ఇంటి స్థలం పట్టా ఇప్పిస్తానంటూ చెప్పాడు. సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఉద్యోగం రాలేదు. ఇంటి పట్టా కూడా ఇప్పించలేదు. దాంతో ఆమె తన డబ్బులు తనకు ఇవ్వమంటూ అడగడం మొదలుపెట్టింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో గత నెల 30వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో సందీప్, అతడి భార్య విజయమ్మ, సోదరి పూర్ణిమ బాధితురాలి ఇంటికి వచ్చారు. తమపై పోలీసు కేసు పెట్టి మా పరువు తీస్తావా అంటూ బూతులు తిడుతూ కాళ్లు చేతులతో కొట్టారు. అసభ్యంగా ప్రవర్తించారు. భయాందోళనకు గురైన లక్ష్మి ప్రియ గట్టిగా కేకలు వేయడంతో వారు వెళ్లి పోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండె కవాటాలకు ఆధునిక చికిత్స

ఒంగోలు టౌన్: నగరంలోని కిమ్స్ వైద్యశాలలో గుండె కవాటాలకు అరుదైన ఆధునిక చికిత్స చేసి ప్రాణాపాయంలో ఉన్న రోగిని కాపాడారు. గురువారం కిమ్స్ వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్ట్ కపిల్ కార్తికేయ వివరాలు వెల్లడించారు. ఒంగోలు నగరంలోని లాయరుపేటకు చెందిన బ్రహ్మారెడ్డి గత నెల 27వన కిమ్స్ వైద్యశాలకు తరలించారు. గుండెలోని అయోర్టిక్ వాల్ అనే కవాటం పూర్తిగా దెబ్బ తిన్నట్లు గుర్తించారు. అత్యవరసరంగా ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీ ప్లేస్‌మెంట్ (టావి) అనే ఆధునిక పద్ధతిలో ఆపరేషన్ అవసరం లేకుండానే చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. విజయవంతంగా ఆపరేషన్ చేసిన డాక్టర్ కపిల్ కార్తికేయ రెడ్డిని కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరి నాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంకిరెడ్డి, మెడికల్ డైరెక్టర్ డా. శ్రీహరి రెడ్డి అభినందనలు తెలిపారు.

మురుగు పారుదల సక్రమంగా ఉండాలి

ఒంగోలు సబర్బన్: నగరంలోని మురుగు కాలువల్లో అడ్డంకులను తొలగించి మురుగు సజావుగా వెళ్లేధంగా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె. వెంకటేశ్వర రావు ఆదేశించారు. నగరంలో గురువారం 17, 50 డివిజన్లతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగం వెంకట శేషయ్య, అంబటి ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి

మద్దిపాడు: వెల్‌నెస్ సెంటర్లు వినియోగంలోకి తీసుకురావాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మాధవీలత కోరారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ, బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి లో మందులు ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. బసవన్నపాలెం వెల్‌నెస్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ జరుగుతున్న తీరును అభినందించారు. అనంతరం జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఫర్ హెచ్ఐవీ అండ్ లెప్రసీ డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్నవారిని గుర్తించాలని కోరారు. అనంతరం ఆమె లెప్రసీకి సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ ఆనందమోహన్, డాక్టర్ వినీల చౌదరి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, వైద్యశాఖ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడవద్దు

మద్దిపాడు: నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు సరఫరా చేయాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని ఏఓ కె. రమేష్ అన్నారు. గురువారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ఉన్న సదరన్ పెస్ట్ కంట్రోల్ ఫ్యాక్టరీని పరిశీలించారు. అక్కడి పురుగు మందుల శాంపిల్స్ సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపించనున్నట్లు చెప్పారు. నాణ్యమైనవి కాకపోతే ఆబ్యాచ్ సరఫరా నిషేధిస్తామని స్పష్టం చేశారు. తయారీదారులు పురుగు మందుల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పరిణామాలపై అవగాహన

ఒంగోలు: జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై ఏపీటీఎఫ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. గురువారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సదస్సుకు ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.విజయసారథి, పి.పాండురంగవరప్రసాదరావు మాట్లాడారు. ఇప్పటివరకు నడిచిన సమాజపు చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రేనని, కమ్యూనిస్టులు ప్రతిచోటా ఆనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్ని బలపరిచారన్నారు. చెన్నుపాటి మంజుల, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బూచేపల్లి బాధ్యతల స్వీకరణకు తరలిరండి

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి బాధ్యతలను స్వీకరించనున్న కార్యక్రమానికి పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు కోరారు. కరపత్రాలను గురువారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి శుక్రవారం ఒంగోలులోని పార్టీ నూతన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో అన్ని గ్రామాల నుంచి తరలిరావాలన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమేరకు నాగులుప్పలపాడు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ